క్లుప్తంగా

ఆస్పత్రి అభివృద్ధికి కృషి

చిత్తూరు రూరల్: ఆస్పత్రిలోని సమస్యలను పరిష్కరించి ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా చూస్తామని ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్ అన్నారు. చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పతిలో శనివారం ఆస్పత్రి నిర్వహణపై సమావేశం నిర్వహించారు. కమిటీ ఏర్పాటు చేసి తద్వారా ఆస్పత్రి సమస్యలు, అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. అన్ని విభాగాలకు సంబంధించిన వైద్యులు ఉండేలా చూడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అపోలో నిర్వాహకులు నరేష్‌కుమార్‌రెడ్డి, స్మార్ట్ సిటీ సభ్యులు సత్య తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకం విద్యార్థి ప్రతిభ



ఎంపికైన విద్యార్థితో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

ఐరాల: జిల్లా స్థాయిలో నిర్వహించిన ఇన్‌స్పైర్ మనక్ అవార్డు పోటీల్లో కాణిపాకం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి హర్షవర్ధన్ ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు శనివారం హెచ్‌ఎం చంద్రశేఖర్‌నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్‌ను అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు పీఈఎస్ పబ్లిక్ పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనక్ పోటీల్లో హర్షవర్ధన్ నీరు వృథా కాకుండా పొదుపుగా వాడుకునే పరికరాన్ని తయారు చేసినందుకు ఈ అవార్డు వచ్చిందన్నారు. హర్షవర్ధన్‌కు గైడ్ చేసిన ఉపాధ్యాయుడు సురేంద్రబాబును హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలు వరం



చిన్నారికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత


ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం పేద ప్రజలకు వరమని, ఇంటి వద్దకే మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మండలంలోని పి.కట్టకిందపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 70 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యాయామం అలవర్చుకోవాలని సూచించారు. గర్భిణులు ఆకు కూరలు, కాయగూరలు ఆహారంలో ఉండేలా చూసుకోవాలని చెప్పారు. ప్రజలు తప్పనిసరిగా ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ జీవకళ, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కోనేటిరాయస్వామి ఆలయంలో అన్నదానం

గంగవరం: మండలంలోని టీటీడీ అనుబంధమైన కీలపట్ల కోనేటిరాయస్వామి ఆలయంలో శనివారం అన్నదానం నిర్వహించినట్లు టెంపుల్ ఇన్స్‌పెక్టర్ గజేంద్ర తెలిపారు. కార్యక్రమానికి పలమనేరుకు చెందిన దాతలు హరి, మీనాక్షి సహకారం అందించినట్లు వెల్లడించారు. దాతల తోడ్పాటుతో కల్యాణోత్సవం, అన్నదానం వంటి విశిష్ట కార్యక్రమాలు నిత్యం చేపడుతున్నట్లు వివరించారు.

ప్రతి ఇంటికీ తాగునీరు

నగరి : ప్రతి ఇంటికీ జలజీవన్ మిషన్ ద్వారా తాగునీటిని అందించనున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కె.విజయ కుమార్ అన్నారు. మండలంలో శనివారం జలజీవన్ మిషన్ పథకం ద్వారా చేపట్టిన పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఇంకనూ ప్రారంభించని పనులను స్వయం సహాయక సంఘాలకు కమ్యూనిటీ కాంట్రాక్ట్ సిస్టమ్ ద్వారా ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్రతి గ్రామంలో గ్రామ జల సంఘాన్ని ఏర్పాటుచేసి వారికి రివాల్వింగ్ ఫండ్ అందిస్తామన్నారు. గ్రామ జల సంఘం, తమ సభ్యులతో చర్చించి, వారి గ్రామ అవసరాల దృష్ట్యా కావలసిన పైప్‌లైన్, ప్రతి ఇంటికీ తాగునీటి కొళాయి ఏర్పాటు చేయడం వంటి పనులను కమ్యూనిటీ కాంట్రాక్ట్ సిస్టమ్ ద్వారా పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. డీవీఆర్ కండ్రిగలో మండల నిధుల ద్వారా వేసిన బోరును పరిశీలించిన ఆయన పైప్ లైన్ పనులను చేపట్టాలని సూచించారు. మండల అసిస్టెంట్ ఇంజనీర్లు, వెలుగు ఏపీఎంల ద్వారా గ్రామ జల సంఘాన్ని త్వరితగతిన ఏర్పరచి, రివాల్వింగ్ ఫండ్ జమచేయుటకు వీలుగా ప్రతి గ్రామ జల సంఘానికి బ్యాంక్ ఖాతా ఓపెన్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈఈ యంఆర్.సతీష్ కుమార్, నగరి, విజయపురం, నింద్ర ఏఈఈలు ఆర్.శైలేంద్ర, కెవి.శ్రీకాంత్, కె.అంజేరయ్య పాల్గొన్నారు.



డీవీఆర్ కండ్రిగ వద్ద బోరును పరిశీలిస్తున్న ఎస్ఈ

రైలు పట్టాలపై బలవన్మరణాలు

- రూ.లక్షలు పోసి చదివిస్తున్నాం మార్కులు తక్కువ వస్తున్నాయని ఇంట్లో మందలించడంతో ఓ వైద్య విద్యార్థిని చిత్తూరు నగరంలో పట్టాలపై తనువు చాలించింది.
- సంపాదన చాలలేదు పిల్లలు ఉన్నారు. ఇలాగే ఉంటే కష్టమని భార్య మందలించడంతో ఒక కూలీ పూతలపట్టు–గుడిపాల మార్గంలో పట్టాలపై తుదిశ్వాస విడిచాడు.
- తీసుకున్న అప్పులు వడ్డీతో కలిపి కొండంతగా మారడంతో వాటిని తీర్చలేక బాధతో ఓ చిరువ్యాపారి కుప్పంలో పట్టాలపై తలపెట్టాడు.

- గత రెండేళ్లలో 145 మంది మృతి
- అందులో గుర్తింపు లేనివి 55



చిత్తూరులో రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం వద్ద పోలీసులు(ఫైల్)

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు రైల్వే పోలీసుల (జీఆర్‌పీ) పరిధిలో 140 కిలోమీటర్ల మేర రైలు మార్గం విస్తరించి ఉంది. నిత్యం దాదాపు 50 వరకు రైళ్ల రాకపోకలు సాగిస్తుంటాయి. రైల్వే ప్రయాణికులు కనీస జాగ్రత్తలు పాటించకపోవడం వల్ల చోటుచేసుకునే ప్రమాదాలూ ఉన్నాయి. ప్రమాద నివారణ చర్యల్లో రైల్వే అధికారుల ఉదాసీనతకు మరికొన్ని ప్రాణాలు రైలు చక్రాల కింద నలుగుతున్నాయి. రైలు ప్రమాదాల్లో ఎలాగోలా గుర్తించిన మృతదేహాలు బంధువులకు చేరుతున్నాయి. గుర్తించలేనివి అనాథ శవాలుగా మిగిలిపోతున్నాయి. దీనికి తోడు బలవన్మరణాల సంఖ్య పెరిగింది. గత రెండు సంవత్సరాలుగా జిల్లాలో రైలు పట్టాలపై జారిపడి, బలవన్మరణం కారణాలతో 145 మంది మృతి చెందారు. దీనిని బట్టి చూస్తే నెలకు సగటున ఐదుగురు రైలు పట్టాలపై మృత్యువాత పడుతున్నారు. చిత్తూరు రైల్వే జిల్లా పరిధిలో చిన్న, పెద్ద రైల్వేస్టేషన్లు కలిపి 11 ఉన్నాయి. వీటి పరిధిలో ప్రతి వారం ఏదో ఒక ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఎక్కువగా కుప్పం–గుడుపల్లె, తిరుపతి–పాకాల, పాకాల–చిత్తూరు, చిత్తూరు–బొమ్మసముద్రం రైల్వేస్టేషన్ల పరిధిలో మరణాలు సంభవిస్తున్నాయి. రైలు పట్టాలు దాటుతూ, రైల్లో నుంచి జారిపడి, రైలు కిందపడి ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ప్రేమ విఫలమై, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలు తదితర కారణా లతో 85 మంది బలవన్మరణాలకు రైలు పట్టాలు వేదికగా మారాయి. ఇతర కారణాలతో 60మంది మరణించగా వారి వివరాలు దొరక్కపోవడం శోచనీయం.

గుర్తింపు కష్టం

నెలకు సగటున ఐదుగురు వరకు రైలు ప్రమాదాల్లో మృతి చెందుతున్నారు. వారి మృతదేహాలు ఛిద్రమై గుర్తుపట్టలేని విధంగా మారుతుంటాయి. అనేక సందర్భాల్లో మృతదేహాలు రైలు పట్టాల పక్కనున్న ముళ్లపొదలు, పిచ్చిమొక్కల మధ్యన పడితే కొన్ని రోజుల వరకూ ఎవరూ గుర్తించలేరు. కొన్ని మృతదేహాలు పురుగులుపడి కుళ్లిపోయి మరింత దారుణంగా ఉంటాయి. అయిన వారు సైతం మృతదేహాలను గుర్తు పట్టడం కష్టతరమే. నిబంధనల ప్రకారం గుర్తుతెలియని మృతదేహాలను 72 గంటల పాటు మార్చురీలో భద్రపరచాల్సి ఉంటుంది. అప్పటికీ మృతుడి సంబంధీకులు ఎవరూ రాకపోతే రైల్వే పోలీసులు మున్సిపాలిటీకి మృతదేహాలను అప్పగిస్తున్నారు. సంబంధీకులు కడసారి చూపునకు కూడా నోచుకోక ఎంతో మంది అనాథలుగా కాలగర్భంలో కలిసిపోతున్నారు. కదిలే రైలు నుంచి ఎక్కడం, దిగడం, ఫుట్‌బోర్డు ప్రయాణం, అటు, ఇటు గమనించకుండా అజాగ్రత్తగా రైలుపట్టాలు దాటడం, తదితర కారణాలతో కొందరు చనిపోతున్నారు. సాధారణంగా రహదారిపై ప్రమాదాలు అందరికీ కనిపిస్తుంటాయి. ప్రమాదం జరిగితే అయ్యో అంటూ ప్రజలు పరుగులు తీసి అవసరమైన సాయం అందిస్తారు. కానీ రైలు పట్టాలపై జరిగే ఘటనలు చాలా వరకు ఎవరికీ కనిపించవు. దీంతో ఒకవేళ వారు కొన ఊపిరితో ఉన్నా వారిని రక్షించే పరిస్థితి లేదు. ఫలితంగా ఎక్కువ శాతం మరణాలు చోటుచేసుకుంటున్నాయి.

ఆధార్ ఆప్షన్‌తో ఉపయోగం

పలువురు రైలు ప్రమాదాలు, ఆత్మహత్యలతో మరణిస్తున్నారు. గుర్తింపు లేని మృతదేహాల వివరాలు తెలుసుకోవడానికి ఫింగర్ ప్రింట్‌తో ఆధార్ వివరాలు వచ్చే విధంగా విధానం ఉంటే బాగుంటుంది. పలు మృతదేహాల వివరాలు తెలియక నిబంధనల ప్రకారం మార్చురీలో ఉంచి చివరి కార్యం కోసం మున్సిపాలిటీ వారికి అందజేస్తున్నాం.

– ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ, జీఆర్‌పీ

తీవ్ర ఒత్తిడితోనే ఆత్మహత్యలు

కరోనా తర్వాత రైల్వే పట్టాలపై ఆత్మహత్యలు దాదాపు 15 శాతం పెరిగాయి. ఉద్యోగ, వ్యాపార, విద్య, కుటుంబం, తాగుడు ఇతర కారణాలతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇందులో పురుషులే అధికం ఉండడం గమనర్హం. రైలు పట్టాలపై సులువుగా చేరుకునే వీలు లేకుండా ఫెన్సింగ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. తీవ్ర ఒత్తిడిలో ఉన్నవారిని గుర్తించి కౌన్సెలింగ్ ఇవ్వడం ద్వారా ఆత్మహత్యలను తగ్గించవచ్చు.

– దినేష్, సైకియాట్రిస్టు

పాల సేకరణలో మోసాలకు అడ్డుకట్ట



డాక్టర్ లావణ్య

తవణంపల్లె: దేశంలోనే ఎక్కడా లేని విధంగా పాల సేకరణ విక్రయాల్లో మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు పాల సేకరణ(రైతు రక్షణ) నాణ్యమైన పాల వినియోగ చట్టం–2023ను పటిష్టంగా అమలు చేయనున్నట్లు మండల మిల్క్ ఇన్‌స్పెక్టర్, పశువైద్యాధికారి లావణ్య తెలిపారు. ఆమె శనివారం విలేకరులతో మాట్లాడుతూ పాల సేకరణలో మోసాలకు పాల్పడినట్లు గుర్తిస్తే మిల్క్ ఎనలైజర్స్, ఇతర పరికరాలను సీజ్ చేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చట్టప్రకారం ఇన్‌స్పెక్టర్లు మిల్క్ ఎనలైజర్స్‌తోపాటు పాల సేకరణ కేంద్రాలు, బల్క్‌మిల్క్ కూలింగ్ యూనిట్లు, ఆటోమేటిక్ మిల్క్ కలెక్షన్ యూనిట్లు సక్రమంగా పని చేసేలా పర్యవేక్షిస్తామన్నారు.

లైసెన్స్ తప్పనిసరి

మండలంలో మిల్క్ ఎనలైజర్స్ కలిగిన వారు అధికారి నుంచి మార్చి 10 లోపల తప్పకుండా లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. లైసెన్స్‌కు రూ.వెయ్యి చెల్లించాలన్నారు. తర్వాత మిల్క్ ఇన్‌స్పెక్టర్ దగ్గర ఏటా లెసెన్స్ రెన్యూవల్‌కు రూ.500 చెల్లించి వెరిఫికేషన్ సర్టిఫికెట్ తీసుకొని యూనిట్ వద్ద ప్రదర్శించాలన్నారు.

క్రమం తప్పకుండా తనిఖీలు

చట్ట ప్రకారం మిల్క్ ఇన్‌స్పెక్టర్లు పాల సేకరణ కేంద్రాలు, డెయిరీల్లో క్రమం తప్పకుండా తనిఖీ నిర్వహిస్తామన్నారు. ఏమైనా తేడాలు ఉన్నట్లు గుర్తిస్తే జరిమానా, లైసెన్సులు రద్దు, కేసుల నమోదు వంటి చర్యలు తీసుకుంటామన్నారు. మోసాలు, కల్తీలు జరిగినట్లు గుర్తిస్తే తగిన చర్యల కోసం ఆహార భద్రత అధికారికి నివేదిక ఇస్తామన్నారు.

సచివాలయ కన్వీనర్‌గా శరత్‌చంద్రారెడ్డి



తవణంపల్లె: మండల సచివాలయ కన్వీనర్‌గా ఎగువ మత్యంకు చెందిన శరత్ చంద్రారెడ్డిని నియమించినట్లు జిల్లా జగనన్న సచివాలయ జిల్లా కో–ఆర్డినేటర్ దినేష్ రెడ్డి తెలిపారు. సచివాలయ కన్వీనర్లు రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపుకోసం కృషి చేయాలని కోరారు. జగన్‌మోహన్ రెడ్డిని మరో సారి సీఎంగా చేయడానికి సచివాలయ కన్వీనర్లు కష్టపడి చేయాలన్నారు.

శాస్త్ర, సాంకేతిక ప్రదర్శనలో విద్యార్థిని ప్రతిభ





అధికారుల నుంచి జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న విద్యార్థిని కె.స్నేహ, విలేజ్ డ్రైనేజీ సిస్టం ప్రాజెక్టును ప్రదర్శిస్తున్న విద్యార్థిని స్నేహ

తవణంపల్లె: జిల్లా స్థాయిలో నిర్వహించిన శాస్త్ర, సాంకేతిక ప్రదర్శనలో మండలంలోని తెల్లగుండ్లపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో 7వ తరగతి విద్యార్థిని కె.స్నేహ ఉత్తమ ప్రతిభతో రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికై ంది. ఇన్‌స్పైర్ మనక్ జిల్లా స్థాయిలో సైన్స్ ఎగ్జిబిషన్ ఈ నెల 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు యాదమరి మండలంలోని మోర్దానపల్లె దగ్గర ఉన్న పీఈఎస్ పబ్లిక్ స్కూల్లో నిర్వహించారు. ఈ ప్రదర్శనలో విద్యార్థిని కె.స్నేహ విలేజ్ డ్రైనేజ్ సిస్టం ప్రాజెక్టు, 8వ తరగతి చదువుతున్న విద్యార్థి పి.పార్థసారథి రోబో సిస్టమ్ ప్రయోగాన్ని తయారు చేసి జిల్లా స్థాయిలో ప్రదర్శించారు. జిల్లా స్థాయిలో సుమారు 300 మంది విద్యార్థులు పలు అంశాలపై ప్రయోగాలు, ప్రాజెక్టులు తయారు చేసి ప్రదర్శించారు. వీటిలో స్నేహ రూపొందించిన విలేజ్ డ్రైనేజ్ సిస్టం నిర్వహణ ప్రాజెక్టును రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. విద్యార్థిని స్నేహకు జిల్లా విద్యాశాఖ అధికారులు, జిల్లా సైన్స్ అధికారులు చేతులు మీదుగా మెమెంటో, ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శనివారం మండల విద్యాశాఖ అధికారులు హేమలత, త్యాగరాజులు రెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఎం.మునస్వామి, గైడ్ ఉపాధ్యాయులు భువనేశ్వర రెడ్డి స్నేహను అభినందించారు.

ఈవీఎంల వినియోగంపై అవగాహన



ఈవీఎంలో ఓటు ఎలా వేయాలో అవగాహన కల్పిస్తున్న నగరపాలక కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్ : ఈవీఎంల వినియోగంపై ప్రజలకు అవగాహన ముఖ్యమని నగరపాలక కమిషనర్ అరుణ అన్నారు. చర్చివీధిలోని మార్కెట్ వద్ద శనివారం ఈవీఎంల పనితీరు, ఓటు వేసే విధానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో కమిషనర్ అరుణ మాట్లాడుతూ ఓటర్లకు ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించారు. ఈవీఎంలలో అభ్యర్థుల పేర్లు, గుర్తులు ఎక్కడ ఉంటాయి? ఓటు వేయాలంటే ఏ బటన్ నొక్కాలి? వేసిన ఓటు చెల్లుబాటు అయ్యిందా లేదా? తెలుసుకోవడం ఎలా అనే అంశాలపై తెలియజేశారు. వీవీ ప్యాట్‌లో ఓటు ఏ గుర్తుకు పడిందో సరిచూసుకోవచ్చని తెలిపారు. ఈవీఎంలలో ఎలా ఓటు వేయాలో తెలియపరుస్తూ నమూనా పోలింగ్ నిర్వహించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్, జిల్లా ఎన్నికల అధికారి వారి ఆదేశాల మేరకు ఈవీఎంల వినియోగంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరపాలక ఏసీపీ రామకృష్ణుడు, సీఎంఎం గోపి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థుల ప్రతిభ

సదుం: స్థానిక ఎంజేపీ గురుకుల పాఠశాల విద్యార్థులు ఈఈఎంటీ (ఎడ్యుకేషన్ ఏపీఫాని మెరిట్ లిస్ట్)లో ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసుల రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీన ఆన్‌లైన్‌లో నిర్వహించిన మెయిన్స్ పరీక్షలో పదో తరగతి విభాగంలో లీలాధర్ మొదటి ర్యాంకు, ఏడో తరగతికి సంబంధించి మిథున్‌కుమార్ రెండో ర్యాంకు సాధించిటన్లు వెల్లడించారు. సత్తా చాటిన విద్యార్థులు శనివారం విజయవాడలో విద్యాశాఖ కమినర్ సురేష్‌కుమార్, జేడీ సుబ్బారావు చేతులమీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందుకున్నట్లు వివరించారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం కల్పలతా రెడ్డి

యాదమరి: ఓటు హక్కు వినియోగంపై సంఘమిత్రలకు ఏపీఎం కల్పలతారెడ్డి శనివారం నిర్వహించారు. ఉదయం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో సంఘమిత్రలకు ఓటు హక్కును సక్రమంగా ఉపయోగించుకోవాలని సూచించారు. అందులో భాగంగా ఆండ్రాయిడ్ ఫోన్లలో గుగూల్ ప్లేస్టోర్‌లో వెళ్లి ఓటర్ హెల్ప్‌లైన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. అందులో ఫారం 5ను ఉపయోగించి కొత్త ఓటర్లును రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని చెప్పారు. ఆ యాప్‌లో జనరల్ ఓటర్ల కోసం, దివ్యాంగుల ఓటర్లకోసం ఫిర్యాదు చేయడానికి అవకాశం ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా కాశీవిశ్వేశ్వరస్వామి ధ్వజారోహణం



హంసవాహనంపై ఊరేగుతున్న స్వామివారు

పలమనేరు: పట్టణంలోని శ్రీకాశీ విశ్వేశ్వరాలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శాస్త్రోక్తంగా ధ్వజారోహణం నిర్వహించారు. శ్రీసిద్ధేశ్వర స్వామి చేనేత సాలి కులస్తుల సేవా సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో తొలుత స్వామివారికి అభిషేకం, అంకురార్పణ, కలశ స్థాపన జరిపించారు. అనంతరం మృత్స్యంగ్రహణం, అగ్నిప్రతిష్ట చేశారు. సాయంత్రం స్వామివారిని హంసవాహనంపై కొలువుదీర్చి వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారు అధికార నంది వాహనంపై ఆదివారం పురవీధుల్లో విహరించనున్నట్లు ఈఓ కమలాకర్ తెలిపారు.

21న చాముండేశ్వరీ దేవి ఆలయ వార్షికోత్సవం



పుంగనూరు: పట్టణంలోని తూర్పుమొగశాలలో ఉన్న చాముండేశ్వరిదేవి ఆలయ వార్షికోత్సవాన్ని ఈనెల 21, 22 తేదీల్లో వైభవంగా నిర్వహించేందుకు జెట్టి కులస్తులు ఏర్పాట్లు చేస్తున్నారు. వారు మాట్లాడుతూ 21న స్వస్తివాచనం, గణపతిపూజ, 22న కలశారాధన, శాంతిహోమం, మహాపూర్ణాహుతితో పాటు పంచామృతాభిషేకం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

నగరి సిగలో మరో మణిమకుటం

- మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం మంజూరు
- తీరిన నగరి ప్రజల కోరిక



ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్న మంత్రి ఆర్కేరోజా (ఫైల్)

నగరి : నగరి పట్టణ హోదా ప్రమాణాలు పెంచడంలో రాష్ట, పర్యాటక, సాంస్కృతిక యువజన సర్వీసుల క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అలుపెరగని పోరాటం చేస్తున్నారు. ప్రజలకు మంచి చేయాలన్న తపన, దాన్ని సఫలీకృతం చేయాలన్న దృఢసంకల్పంతో ముందుకెళుతున్నారు. జిల్లాల పునర్విభజనలో నగరి, విజయపురం, నింద్ర మండలాలు చిత్తూరు జిల్లాకు పుత్తూరు, వడమాలపేట మండలాలు తిరుపతి జిల్లాకు చేరిపోయాయి. దీంతో నియోజకవర్గ అభివృద్ధి రెండు జిల్లాల పరంగా చేపట్టాల్సిన పరిస్థితి ఎదురైంది. అన్ని మండలాలను సమర్థవంతంగా అభివృద్ధి చేయడంలో మంత్రి విజయవంతంగా దూసుకెళుతున్నారు. నగరిని డివిజన్ కేంద్రంగా చేయడంతో నగరిలోనే ఆర్డీవో కార్యాలయం, డీఎస్పీ కార్యాలయం ఇప్పటికే ఏర్పాటయ్యాయి. దీంతో నగరి, నింద్ర, విజయపురం మండలాలకు చెందినవారు చిత్తూరుకు వెళ్లే పరిస్థితి లేకుండా భూములకు సంబంధిత వ్యవహారాలకు నగరిలోని ఆర్డీవో కార్యాలయంలోనే పరిష్కరించుకునే సదుపాయం కల్పించారు. మరోవైపు పుత్తూరులోను డీఎస్పీ కార్యాలయాన్ని కొనసాగించారు. అయితే పుత్తూరులోని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం తిరుపతి జిల్లాకు చేరిపోవడంతో నగరి, నింద్ర, విజయపురం మండలాలకు చెందిన వారు వాహనాలకు లైసెన్స్ తీసుకోవాలంటే చిత్తూరుకు వెళ్లాల్సి వచ్చింది. ఇది వారికి చాలా కష్టతరంగా మారింది. దీంతో వారు మంత్రి ఆర్కేరోజాకు తమ సమస్యను విన్నవించుకున్నారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి మంత్రి ఆర్కేరోజా తీసుకెళ్లారు. సమస్యను పరిష్కరించాలంటూ వినతి పత్రం సమర్పించారు. దీంతో ముఖ్యమంత్రి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో నగరి పట్టణానికి మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం మంజూరైంది. ఈ మేరకు ప్రిన్సిపల్ కార్యదర్శి ప్రద్యుమ్న నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

ఆరు మండలాలకు ప్రయోజనం

నగరితో పాటు నింద్ర, విజయపురం, కార్వేటినగరం, వెదురుకుప్పం, పాలసముద్రం మండలాల్లోని వారికి ప్రయోజనం కలిగించేలా నగరి పట్టణంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం ప్రారంభం కానుంది. ఇక డ్రైవింగ్ లైసెన్సులు తీసుకోదలచిన వారు చిత్తూరుకు వెళ్లాల్సిన అవసరం లేదు. అందుబాటులో నగరిలోనే లైసెన్సులు, వెహికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందవచ్చు.

అడిగిన వెంటనే ఓకే చేసిన జగనన్న

ప్రజల సౌకర్యార్థం అడిగిన ప్రతి పని జగనన్న చేయడంతోనే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయగలుగుతున్నానని మంత్రి ఆర్కేరోజా శనివారం మీడియాకు వివరించారు. నియోజకవర్గ హోదా ప్రమాణాలు పెంచేలా నగరిలో ఆర్డీవో కార్యాలయం, డీఎస్పీ కార్యాలయం, ఎంవీఐ కార్యాలయం తెప్పించగలిగానన్నారు. పుత్తూరులోని డీఎస్పీ కార్యాలయాన్ని, ఎంవీఐ కార్యాలయాన్ని అలాగే కొనసాగించగలిగానన్నారు. అడిగిన వెంటనే అన్ని ప్రయోజన పనులకు ఓకే చెబుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి ఉంటామని మంత్రి చెప్పారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

పుత్తూరు: మానవ అక్రమ రవాణా, కల్తీ ఆహారాన్ని నిరోధించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి ఎస్.సీ.రాఘవేంద్ర పిలుపునిచ్చారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నారాయణవనం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన జడ్జి మాట్లాడుతూ పిల్లలకు జంక్ ఫుడ్‌ను అలవాటు చేయరాదని తెలిపారు. పిల్లల పరిరక్షణ బాధ్యత తల్లిదండ్రులపై మరింతగా ఉందన్నారు. పిల్లలు ఎప్పుడూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పరిరక్షణలో ఉండాలని సూచించారు. పిల్లలకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని సూచించారు. పిల్లలను ఒంటరిగా బయటకు పంపకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదంలో ఉన్నప్పుడు 100కు ఫోన్ చేయాలని లేకుంటే దిశా యాప్ ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యాలయాల్లో మహిళా ఉద్యోగులు లైంగిక వేధింపులకు గురైతే, లైంగిక వేధింపుల నిరోధక కమిటీకి ఫిర్యాదు చేయాలన్నారు. ఇటీవల కాలంలో పిల్లల కిడ్నాపింగ్స్ పెరుగుతున్నాయని, వీటి నియంత్రణలో పోలీసులు తమ వంతు పాత్ర పోషించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సుమతి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న జడ్జి రాఘవేంద్ర, సదస్సులో పాల్గొన్న విద్యార్థినులు